క్లుప్తంగా

పొదుపు మహిళలకు పెరటికోళ్లు పంపిణీ



పెరటికోళ్లు పంపిణీ చేస్తున్న వెలుగు సిబ్బంది

సి.బెళగల్: స్థానిక స్త్రీశక్తి భవన్ ఆవరణలో పొదుపు మహిళలకు బుధవారం పెరటికోళ్లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా సబ్సిడీపై పొదుపు మహిళలకు కోళ్లను పంపిణీ చేసేందుకు 100 యూనిట్లు మంజూరు అయ్యాయని వెలుగు సీసీలు తెలిపారు. ఒక్క యూనిట్ రూ. 3,250 ఉండగా, యూనిట్‌కు ఎనిమిది కోడి పెట్టలు, నాలుగు పుంజుల చొప్పున మొత్తం 11 కోళ్లను 100 మంది మహిళలకు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు శ్రీనివాసులు, మాదుల, మహబూబ్‌బాషా, గుండమయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ పూర్తి చేయండి



వ్యవసాయ సహాయకులతో సమీక్షిస్తున్న ఏడీఏ

సి.బెళగల్: రైతులు రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటల వివరాలను ఈపంట నమోదు చేసి, సంబంధిత రైతుల బయోమెట్రిక్‌తో ఈకేవైసీని వంద శాతం పూర్తి చేయాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి ఆదేశించారు. బుధవారం మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్‌తో కలిసి మండలంలోని వ్యవసాయ సహాయకులతో సమీక్షించారు. వ్యవసాయ సహాయకులు గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ రబీ పంటల సంరక్షణపై రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా రబీ పంటల నమోదును పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఏఈఓ హిమబిందు, వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

లంబాడీలకు వైన్‌షాపులు కేటాయించాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు కైలాస్ నాయక్, నాగరాజు నాయక్

కర్నూలు(రూరల్): గిరిజన లంబాడీలకు మద్యం దుకాణాలను కేటాయించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కైలాస్ నాయక్ డిమాండ్ చేశారు. నందనపల్లె సుగాలి తండాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో గిరిజన లంబాడీలకు సరైన గుర్తింపు లభించలేదని తెలిపారు. సంక్షేమ పథకాలు, కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 40 నియోజకవర్గాల్లో లంబాడీలు 12 లక్షల జనాభా ఉన్నారన్నారు. సామాజిక వర్గానికి మద్యం దుకాణాలను కేటాయించాలని కోరారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రంగనాయక్ పాల్గొన్నారు.

రీసర్వే పనుల పరిశీలన



రీసర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న డీటీ

సి.బెళగల్: మండల కేంద్రంలో వీఆర్వోలు, సర్వేయర్లు చేపట్టిన భూముల రీసర్వే పనులను డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. బుధవారం మండల సర్వేయర్ నాగభూషణం ఆధ్వర్యంలో వీఆర్వోలు, సర్వే సహాయకులతో గ్రామంలోని పలు బ్లాక్‌లలో సర్వే చేశారు. గ్రామంలో ఏడు బృందాలు 39 బ్లాక్‌లలోని భూములను సర్వే చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆర్ఎస్ డీటీ, సర్వే అధికారులు తెలిపారు. సి.బెళగల్ రెవెన్యూ పరిధిలోని సి.బెళగల్, చింతమానుపల్లె గ్రామాలకు చెందిన భూములను రీ సర్వే చేస్తామన్నారు. సర్వేలో వీఆర్వోలు గౌరి, వెంకటేశ్వర్లు, సర్వే సహాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

గడివేముల:గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీఓ వాసుదేవగుప్తా సూచించారు. బుధవారం మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో ఎస్ఐఆర్‌డీ రాష్ట్ర క్వాలిటీ మానిటరింగ్ అధికారి నాగేశ్వరరావు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలని తెలిపారు. ప్రాధాన్యతను అనుసరించి పనులు చేయాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

హైవేపైనే దోపిడీ!

- దారిదోపిడీలతో భయపడుతున్న వాహనదారులు
- హైవే అయినప్పటికీ కొనసాగుతున్న ఘటనలు
- పట్టించుకోని అధికారులు



శాంతిరామ్ ఆసుపత్రి- బలపనూరు మెట్ట వరకు జాతీయరహదారి

పాణ్యం: హైవేపైనే దుండగులు దారిదోపిడీలకు తెగపడుతున్నారు. వరుస ఘటనలతో వాహనదారులు హడలిపోతున్నారు. తమ్మరాజుపల్లె-సిమెంట్ నగర్ ఘాట్‌లోని శాంతిరామ్ ఆసుపత్రి-బలపనూరు మెట్ట మధ్యలో దారిదోపిడీలకు దొంగలు అడ్డాగా ఎంచుకున్నారు. రాత్రి సమయంలోనే కాదు మిట్ట మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లోనూ ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ఒక్కోసారి తప్పని పరిస్థితుల్లో ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. దారిదోపిడీలను అరికట్టాల్సిన పోలీసు, హైవే అధికారులు మాత్రం గుడ్లప్పగించి చూస్తున్నారు.

ఇప్పటి వరకు జరిగిన దారిదోపిడీ ఘటనల్లో కొన్ని..

- 2021 సెప్టెంబర్ 5న సిమెంట్‌నగర్ ఘాట్‌లో దారిదోపిడీ సిద్ధంగా ఉన్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరిచారు. వారికి రెండేళ్ల శిక్ష పడింది.
- 2021 జూన్ 30న ఇదే రూట్‌లో బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను బెదిరించి, వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్, బంగారు ఆభరణాలు లాక్కెళ్లారు.
- 2023 ఆగస్టు 18న కందికాయపల్లె సోలార్ నుంచి వస్తున్న ఇద్దరిని అటకాయించిన దుండగులు మహిళ మెడలోని బంగారు గొలుసు, నగదును ఎత్తుకెళ్లారు.
- రెండేళ్ల క్రితం భూపనపాడు-కొలూరు గ్రామాల మధ్య పుట్టాలమ్మ ఆలయం వద్ద బైక్‌పై వెళ్తున్న వారిని అడ్డగించి వారిపై దాడి చేసి నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లారు.
- 2024లో బలపనూరు మెట్ట వద్ద బైక్‌పై వస్తున్న ఇద్దరిని ఆపి వారి వద్ద బంగారు, నగలు, నగదును తస్కరించారు.
- ఈనెల 19న భూపనపాడు గ్రామానికి చెందిన భార్యాభర్తలను అడ్డగించి వారిపై కత్తితో దాడి చేసి వారి వద్ద బంగారు గొలుసు, రూ.10 వేల నగదును దోచుకున్నారు.

నిబంధనలు పాటించని వెంచర్లను తొలగించాలి



వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఓర్వకల్లు: మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన వెంచర్లను తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ మండల కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి సుధాకర్ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారి వెంకటరమణయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని రూ.లక్షలకు అంటగడుతున్నారన్నారు. కనీసం పంచాయతీ తీర్మానాలు లేకుండా విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించని వెంచర్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సామాజిక అంశాలపై అవగాహన



ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: సమాజంలో జరుగుతున్న అసమానతలు, రుగ్మతులు, వివక్ష, దాడులు, చట్టాలు, ఆరోగ్య పరిరక్షణ వంటి సామాజిక అంశాలపై బాలికలకు అవగాహన అవసరమని ఎంఈఓలు జ్యోతి, ఆదామ్ బాషా అన్నారు. బుధవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, సుజాత సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులకు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లకు కిశోరి వికాసం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు హాజరై బాలికల సంరక్షణ, బాల్యవివాహాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంగాల, బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు సునీల్‌రాజు, నిర్మలా, వసంతకుమారి, వెలుగు సీసీలు శ్రీనివాసులు, గుండమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని రాస్తారోకో



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు

కోడుమూరు రూరల్: వెంకటగిరి ప్రాథమిక పాఠశాలలో పిల్లలతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు లక్ష్మన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, విద్యార్థి, ప్రజా సంఘాలు బుధవారం కోడుమూరు కోట్ల సర్కిల్‌లో రాస్తారోకో, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఆంధ్రయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి మాట్లాడుతూ.. విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడే చిన్నారులపై అసభ్యంగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు గఫూర్ మియ్యా,రాజు,నాగేష్, అల్తాఫ్, పులికొండ, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించి అధిక దిగుబడులను పొందాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి అన్నారు. మంగళవారం సి.బెళగల్, కంబదహాల్ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సి.బెళగల్ రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాలను గ్రామీణ రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వ్యవసాయ పొలాలను సందర్శించారు. పంట సాగు, సంరక్షణ సూచనలను చేశారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలు, భూసార పరీక్షల విధానం, కంది కొనుగోలు అంశాలను వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, ఏఈఓ హిమబిందు, ఎంఈపీఈఓ వెంకటేష్, వీఏఏ ఆసీఫ్ పాల్గొన్నారు.

వచ్చే నెల శ్రమశక్తి సంఘాల ఏర్పాటు



ఉపాధి కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏపీడీ పక్కీరప్ప

కోడుమూరు రూరల్: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించేందుకు ఫిబ్రవరి నెల నుంచి శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు ఏపీడీ పక్కీరప్ప తెలిపారు. బుధవారం మండలంలోని అమడగుంట్ల, ప్యాలకుర్తి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీల హాజరు, మస్టర్లను ఏపీడీ పరిశీలించి కూలీలు, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం కోడుమూరు ఉపాధి కార్యాలయానికి చేరుకుని కార్యాలయ రికార్డులను పరిశీలించడంతో పాటు, పనుల నిర్వహణపై సిబ్బందితో చర్చించారు. మండలంలో ప్రస్తుతం తక్కువ మంది కూలీలు పనుల్లోకి వస్తున్నారని, కూలీల సంఖ్యను మరింత పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఫిబ్రవరి నుంచి ప్రతి గ్రామంలో 30 నుంచి 50మంది కూలీలతో కలిపి శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సంఘానికి ఒక మేటీని కూడా నియమిస్తామని చెప్పారు. ఏపీడీ వెంట కోడుమూరు ఏపీఓ మోదీన్‌బాషా ఉన్నారు.

నగరపాలక అంచనా బడ్జెట్ రూ.291కోట్లు

- స్థాయీ సంఘ సమావేశంలో సభ్యుల ఆమోదం
- నగర మేయర్ బీవై రామయ్య వెల్లడి



మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నగరపాలక బడ్జెట్‌పై చర్చిస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ 2025- 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం వ్యక్తం చేసింది. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన బడ్జెట్‌పై ప్రత్యేక స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు షేక్ యూనుసుబాషా, జుబేర్, మిద్దె చిట్టెమ్మ, క్రాంతికుమార్ పాల్గొన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చల్లో అందరు సభ్యుల ఆమోదం మేరకు రూ.291.67 కోట్ల అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. మొత్తం ఆదాయం రూ.363.99 కోట్లు కాగా ఖర్చు రూ.291.22 కోట్లు, రెవెన్యూ అదాయం రూ.201.22 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్లు రూ.162.77 కోట్లు, మూలధన రాబడి రూ.138.69 కోట్లు, నికర మిగులు రూ.72.31 కోట్లుగా అంచనాలు తయారు చేశారు. ఇదే సమావేశంలో రెండు తీర్మానాలకు ఆమోదం వ్యక్తం చేశారు. అమృత్-2 పథకంలో భాగంగా 19 వ వార్డులోని టీచర్స్ కాలనీ పబ్లిక్ పార్కుల నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాలకు కేటాయించారు. ఏడాది కాలానికి ఒక్కో పార్కుకు రూ.4.90 లక్షలు చెల్లించేందుకు ఆమోదం వ్యక్తం చేశారు. అలాగే 200 మంది తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి గతేడాది డిసెంబర్ 17 నుంచి ఈ ఏడాది జనవరి 31వ తేదీ నాటికి వేతనాలు చెల్లించేందుకు రూ.42.93 లక్షలు కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, అకౌంట్స్ అధికారి చుండీ ప్రసాద్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓలు జునీద్, ఇజ్రాయేలు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళకు గాయాలు

పాణ్యం: తమ్మరాజుపల్లె ఘాట్ వద్ద బైక్‌పై నుంచి కింద పడి కొణిదేడు గ్రామానికి చెందిన సరస్వతి గాయాలపాలైంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి బనగానపల్లెకు వెళ్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గమనించి తన వాహనంలో మహిళను పాణ్యం సీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు. అనంతరం ఆమెను నంద్యాలకు రెఫర్ చేశారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

కల్లూరు: గతంలో ఉలిందకొండ మీదుగా నడుస్తున్న బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఉలిందకొండ గ్రామస్తులు కోరుతున్నారు. బుధవారం కర్నూలులో ఏపీఎస్‌ఆర్‌టీసీ అధికారులకు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జనార్దన్, సలీం, మధు, మాధవస్వామి, వెంకటరమణ మాట్లాడుతూ గతంలో డోన్, కర్నూలు డిపోలకు చెందిన పల్లెవెలుగు బస్సులు ఉలిందకొండ గ్రామం మీదుగా ప్రయాణించేవన్నారు. రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనుల నిమిత్తం కొంతకాలంగా బస్సులు 44వ జాతీయ రహదారి పైనే వెళ్తున్నాయన్నారు. ప్రస్తుతం కేవలం ఒక బస్సు మాత్రమే గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో తమ గ్రామానికి చెందిన ప్రజలతోపాటు కొంగనపాడు, యాపర్లపాడు, కొల్లంపల్లి తండా, నాయకల్లు, చెట్లమల్లాపురం గ్రామాల ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి గతంలో ఎన్ని బస్సు సర్వీసులు తిప్పేవారో వాటన్నింటిని పునరుద్ధరించాలని కోరారు.


ఫిజియోథెరపీతో వైకల్యం దూరం



ఫిజియోథెరపీ పరిశీలిస్తున్న ఏపీసీ ప్రేమంతకుమార్

పాణ్యం: ఫిజియోథెరపీతో వైకల్యం దూరమవుతుందని అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ)ప్రేమంతకుమార్ అన్నారు. బుధవారం స్థానిక భవిత సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలను భవిషత సెంటర్‌కు తీసుకొచ్చి ఫిజియోథెరపీ చేయించుకుంటే వైకల్యం నయం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ లలిత కుమారి, ఏఏఎంఓ యూనస్, ఏపీఓ రామోహన్, ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, సీఆర్‌పీలు రాజశేఖర్, శ్రీహరి పాల్గొన్నారు.

పకడ్బందీగా జేఈఈ మెయిన్స్



విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు. ఉదయం 166 మందికి గానూ 154 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. పరీక్షల కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించినట్లు చెప్పారు.

రేపు జాబ్‌మేళా

కర్నూలు(అగ్రికల్చర్): నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 24న బి.క్యాంపులోని సిల్వర్‌జుబ్లీ ప్రభుత్వ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎల్అండ్‌టీ,టాటా క్యాపిటల్, కేఎల్ గ్రూపులు పాల్గొంటున్నాయని, హాజరయ్యే వారికి అక్కడే ఇంట ర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి.. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుంద ని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు రెండు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్విని యోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90595 24482, 77804 78910 నంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పాణ్యం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పాణ్యం నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన జారీ చేసింది.

వింగ్	ప్రెసిడెంట్
యూత్ వింగ్	దేరంగుల దుర్గాప్రసాద్
మహిళా విభాగం	దూదేకుల మంజులశ్రీ
రైతు విభాగం	కాళ్ల వెంకటరమణారెడ్డి
బీసీ సెల్	పిడుగుల దేవేందర్‌భవానీ
ఎస్సీ సెల్	వామనగిరి హేమలత
ఎస్టీ సెల్	మేకల స్వామి
మైనార్టీ సెల్	షేక్ ఉసేన్ ఆలం
క్రిష్టియన్ మైనార్టీ సెల్	జి.ప్రిన్స్ లీయో నిదాస్
స్టూడెంట్ వింగ్	మంగళి రాకేష్
పంచాయతీరాజ్ వింగ్	ఈడిగ రంగనాథ్‌గౌడ్
మున్సిపల్ వింగ్	ఆత్మకూర్ నాగలక్ష్మి
రెడ్డి ఆర్‌టీఐ వింగ్	తిగిరెడ్డి రాజమోహన్‌రెడ్డి
వలంటీర్స్ వింగ్	తాటిపాటి తిరుపాల్
గ్రీవెన్స్ సెల్	బోయ శివకుమార్
వాణిజ్య విభాగం	మంచాల సుధాకర్‌రెడ్డి
వీవర్స్ వింగ్	సన క్రిష్ణకాంత్
వైఎస్సార్‌టీయూసీ	షేక్ అబ్దుల్ సుభాన్
అంగన్‌వాడీ వింగ్	గడేకారి జానకమ్మ
లీగల్ సెల్	కప్పెట శివసంజీవరెడ్డి
కల్చరల్ వింగ్	బుడగజంగం శివాజీ కృష్ణ
సోషల్ మీడియా వింగ్	గడేకారి లక్ష్మీప్రసాద్
ఐటీ వింగ్	గొర్రె శివ క్రిష్టారెడ్డి
దివ్యాంగుల విభాగం	మదనకంటి బసవరాజు
డాక్టర్ వింగ్	వడ్ల ఫణీంద్ర ఆచారి
పబ్లిసిటీ వింగ్	మాచ వెంకట సాయిక్రిష్ణ
ఇంటిలెక్చువల్స్	
ఫోరం వింగ్	పందుగ గోవర్ధన్‌రెడ్డి
బూత్ కమిటీ వింగ్	సంపతి సుబ్బారెడ్డి

25లోగా హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ పూర్తి చేయాలి

- డివిజనల్ అభివృద్ధి అధికారి రమణారెడ్డి



సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎల్‌డీఓ రమణారెడ్డి

ఓర్వకల్లు: ప్రతి గ్రామంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌ను ఈనెల 25వ తేదీలోగా పూర్తయ్యేలా చూడాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి రమణారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని నన్నూరు-2, ఓర్వకల్లు సచివాలయాలను సందర్శించారు. సచివాలయ సిబ్బంది హాజరు, పనితీరును పరిశీలించి, సిబ్బంది ద్వారా ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల సర్వేల పురోగతిపై ఆరా తీశారు. మిస్సింగ్ సిటిజన్ అప్‌డేషన్, పీఏసీఎస్ సర్వే, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌లపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా సర్వేలలో ఎంత శాతం పురోగతి సాధించారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నన్నూరు-2 సచివాలయం గ్రామానికి దూరంలో పంట పొలాల మధ్య ఏర్పాటు చేయడం వల్ల సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులు అందడంతో సదరు సచివాలయాన్ని సందర్శించారు. ప్రతి సచివాలయ ఉద్యోగి రోజుకు రెండు సార్లు బయోమెట్రిక్ హాజరు వేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు బషీరున్‌బీ, నాగరాజు ఉన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ సునీల్ కుమార్

ఓర్వకల్లు: వాహన దారులు రోడ్డు నింబంధనలు పాటించాలని ఎస్ఐ సునీల్ కుమార్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్(ఆర్ఈపీఎల్) ప్రాజెక్టు పరిధిలోని ఇంటరైజ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ సునీల్ కుమార్, ప్లాజా మేనేజర్ రవిశంకర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ప్రాణేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రతినిధులు మదన్‌మోహన్, కటారుకొండ రంజిత్‌రెడ్డి, ఆర్ఓఎం సర్వేశ్వర రెడ్డి, ప్లాజా మేనేజర్ రవిరంజన్, సేఫ్టీ మేనేజర్ ఖాదర్‌వలి, ఆర్ఓ కుతుబుద్దీన్‌బాషా, పారామెడికల్ ఇన్‌చార్జ్ అబ్దుల్‌కలాం, ఆర్‌పీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పొంచిఉన్న ప్రమాదం

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామం సచివాలయం, జగనన్న కాలనీకి వెళ్లే రస్తాలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఫ్యూజ్‌లు కిందకు వేలాడుతూ చేతులకు అందేలా ఉన్నాయి. ఈ రహదారిలో నిత్యం రైతులు, ప్రజలతోపాటు పశువులు తిరుగుంటాయి. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రామాయణంపై పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు కల్చరల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం సందర్భంగా వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నగరంలోని పలు పాఠశాలల్లో రామాయణంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించిన పరీక్షలను వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నగరంలోని 15 పాఠశాలల్లో 1500 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ పరీక్షల వల్ల రామాయణంలోని విషయాలు విద్యార్థులకు తెలుస్తాయన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, సహ కోశాధికారి సుబ్రహ్మణ్యం, సేవా కన్వీనర్ గురుమూర్తి, కార్యదర్శి భాను ప్రకాష్ పాల్గొన్నారు.